క్లుప్తంగా

డ్రై డే పాటించాలి

నెహ్రూసెంటర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఫ్రైడే డ్రైడే పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌రెడ్డి అన్నారు. డ్రెయినేజీల్లో వేసే టిమోపాస్‌ను గురువారం పీహెచ్‌సీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆశ కార్యకర్తలు ఫ్రైడే డ్రైడే పాటిస్తూ 10 గ్రాముల టిమోపాస్‌లో 10 లీటర్ల నీళ్లలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. డాక్టర్ సుధీర్, శ్రీనివాస్, గోపిచంద్, రామారావు, స్టాఫ్‌నర్సు భవాని, యూసఫ్, చారీ పాల్గొన్నారు.

'నకిలీ' విక్రయిస్తే లైసెన్స్ రద్దు

గార్ల: ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని ఏఓ కావటి రామారావు, ఎస్సై రియాజ్‌పాషా హెచ్చరించారు. గురువారం గార్లలోని పలు దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేని బీటీ-3 పత్తి రకం విత్తనాలను దుకాణంలో నిల్వ ఉంచినా, రైతులకు విక్రయించినా డీలర్లపై కఠిన చర్యలు తప్పవన్నారు. దుకాణం ఎదుట స్టాక్‌బోర్డులో ఉన్న నిల్వ, రిజిస్టర్‌లో ఉన్న నిల్వ సరిపోయేలా ఉండాలన్నారు.

విత్తనషాపుల్లో తనిఖీలు

బయ్యారం: మండలంలోని గంధంపల్లి-కొత్తపేటలోని ఎరువులు, విత్తనాల షాపుల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని పలు రిజిష్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఎండీ.హన్నన్, ఏఓ రాంజీ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు



నెల్లికుదురు: బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తూ పనిలో పెట్టుకుంటే శిక్షార్హులని తొర్రూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డి.ధీరజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం తాలూకా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే 6నెలల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేష్ బాబు, భారత్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, అడ్వకేట్స్ నాగరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం కృషి

తొర్రూరు రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్టీ జెండాను ఎగరేయాలని, గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ తండా, ఈదులకుంట తండా, దుబ్బతండా, పటేల్‌గూడెం గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో ఝాన్సీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : ఎస్పీ క్యాంపు కార్యాలయ గేటును కారు ఢీ కొట్టిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్‌లోని హనుమంతరావు నగర్ కాలనీ చెందిన భూక్య వినోద్ బుధవారం రాత్రి అతివేగంతో కారు నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో అతడు ముకుంద థియేటర్ సమీపంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన మడూరి రజినీకాంత్, ముదురుకోళ్ల నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వారిద్దరికి గాయాలుకాగా స్థానికులు గమనించి వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆ కారు ముందు భాగంలో ఒక టైరు లేకున్నప్పటికీ డ్రైవరు వినోద్ అదే వేగంతో కారు నడుపుకుంటూ వచ్చి ఎస్పీ క్యాంపు కార్యాలయ ప్రధాన గేటును ఢీకొట్టాడు. గాయపడిన రజినీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినోద్‌పై టౌన్ ఎస్సై విజయ్ కుమార్ కేసు నమోదు చేశారని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని టౌన్ ఎస్సై బి.విజయకుమార్ గురువారం తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని సమాచారం రావడంతో అక్కడకు చేరుకుని పరిశీలించి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించి భద్రపరిచామని, అతడిని ఎవరైనా గుర్తిస్తే మహబూబాబాద్ టౌన్ పీఎస్ నంబరు 87126 56931కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

పనుల్లో జాప్యం..!

- పూర్తికాని రైల్వేఅండర్ డ్రెయినేజీ నిర్మాణం
- 6 నెలలుగా కొనసాగుతున్న పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



అండర్ డ్రెయినేజీ వద్ద పరిస్థితి..



గూడ్సురైలు కింద నుంచి దాటుతున్న మహిళ

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న రైల్వే థర్డ్‌లైన్ పనుల్లో భాగంగా అంబేడ్కర్ సెంటర్ వద్దనున్న అండర్ డ్రెయినేజీ నుంచి రాకపోకలను నిలిపివేశారు. దీంతో పై ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలంటే 3 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడంతో, వాహనాదారులు ఇబ్బందులు పడాల్సివస్తుంది. కేసముద్రం రైల్వేస్టేషన్ పరిధిలో అంబేడ్కర్ సెంటర్ వద్ద గతంలో రైల్వే గేటు ఉండేది. ఆ గేటును కొన్నేళ్ల క్రితం తొలగించి, ప్లాట్‌ఫాంను పొడిగించారు. దీంతో స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండగా, అండర్ డ్రెయినేజీలో పెరిగిన ముళ్లచెట్లు, మురికి నీటిని తొలగించి సీసీ వేశారు. అప్పటి నుంచి వాహనాదారులు, బాటసారులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు పడినప్పుడే రాకపోకలకు అంతరాయం కలిగేది. ఈ క్రమంలో రైల్వే థర్డ్‌లైన్ పనుల్లో భాగంగా, 2024 నవంబర్ 26 నుంచి అండర్ డ్రెయినేజీ వద్ద రాకపోకలను నిలిపివేశారు. 6నెలలు దాటుతున్నప్పటికీ అండర్ డ్రెయినేజీ వద్ద పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా వర్షాలు కురిస్తే అంబేడ్కర్ సెంటర్, సంతోష్‌నగర్ కాలనీ మునిగిపోయే ప్రమాదం ఉంది.

జాడలేని అండర్ బ్రిడ్జి..

ఇప్పటికే కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేశాఖ రైల్వే అండర్‌బ్రిడ్జిని మంజూరు చేసింది. అధికారులు పలుమార్లు స్థలాన్ని పరిశీలించారు. ఇక అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని స్థానికులు భావించారు. కానీ, అదేసమయంలో రైల్వే థర్డ్ లైన్ పనులను చేపట్టారు. దీంతో అండర్ బ్రిడ్జి నిర్మాణం ఇంకెప్పుడు మొదలు పెడతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

త్వరగా పనులు పూర్తిచేయాలి



కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే అండర్ డ్రెయినేజీ వద్ద చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలి. రైల్వే థర్డ్ లైన్ పనుల్లో భాగంగా, అండర్ డ్రెయినేజీ వద్ద చేస్తున్న పనుల్లో జాప్యం జరుగుతుంది. 6నెలలు గడిచినా పనులు పూర్తిచేయలేదు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు మా ఇళ్లు మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం.

- పోలెపాక నాగరాజు, కేసముద్రంస్టేషన్

చుట్టూ తిరిగి వస్తున్నాం..



అండర్ డ్రెయినేజీ వద్ద జరుగుతున్న పనుల కారణంగా, ప్రతి రోజు షాప్‌నకు వెళ్లాలంటే బైక్‌పై 3 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సివస్తుంది. ఇప్పటికైనా అండర్ డ్రెయినేజీ వద్ద పనులను త్వరగా పూర్తి చేస్తే, దూరభారం తగ్గుతుంది. అండర్ బ్రిడ్జి మంజూరైనా, నిర్మాణ పనులు జరగడం లేదు. ఇప్పటికైనా అండర్ బ్రిడ్జిని నిర్మిస్తే సమస్య తీరుతుంది.

- సామల మల్లేశ్, కేసముద్రంస్టేషన్

అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించాలి



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట'లో సీడీపీఓ, తదితరులు



గూడూరు: చిన్నారులకు స్వాగతం పలుకుతున్న సీడీపీఓ తదితరులు

చిన్నగూడూరు/గార్ల/ తొర్రూరు రూరల్/ గూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల పేర్లు నమోదు చేయాలని అధికారులు, సిబ్బంది అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిల్లలు, వారి తల్లులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. చిన్నారులకు ఎగ్ బిర్యానీ పెట్టారు.

రోడ్లను నిర్మించాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని చెరువు కింద చర్లగడ్డ, ఎర్రగుట్టతండాలకు రోడ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వర్‌రావు అన్నారు. బలపాల గ్రామశాఖ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. రోడ్డు సౌకర్యం కల్పించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రామగాని రవి, కన్నోజు వెంకటనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, కుక్కల వెంకన్న, నల్లబోతు దశరథం, తిరుపతయ్య, నవీన్, నాగేశ్వర్‌రావు, వీరన్న, ఉపేందర్, దేవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశంలో సుపరిపాలన

- బీజేపీ రాష్ట్ర సహాయ కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ప్రధాని మోదీతోనే దేశంలో సుపరిపాలన సాగుతుందని బీజేపీ రాష్ట్ర సహాయకోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు వద్దిరాజు రామచందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్‌శర్మ, గడ్డం అశోక్, చీకటి మహేష్‌గౌడ్, సతీష్, ఇందు భారతి, పాదిలా నరిసింహారెడ్డి, ఓర్సు పద్మ, వెన్నమల్ల సందీప్, పల్లే సందీప్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



ఎల్లంపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



దరఖాస్తు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

నెల్లికుదురు/నర్సింహులపేట/ మరిపెడ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో గురువారం నెల్లికుదురు మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో 226 దఖాస్తులు అందినట్లు తహసీల్దార్ చందా నరేష్ తెలిపారు. నర్సింహుల పేట భూభారతిలో 900 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు.

1970కి ముందు పత్రాలుంటేనే..

బయ్యారం: 1970కి ముందు కొనుగోలు పత్రాలు ఉన్నవారే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు పేర్కొనడంతో గురువారం బయ్యారంలో నిర్వహించిన సదస్సులో రైతులు ఆవేదనతో వెనుదిరిగారు. బయ్యారం, జగ్గుతండా, వెంకట్రాంపురం, బాలాజీపేట, బాల్యతండా, చర్లపల్లి పంచాయతీలకు చెందిన రైతులు రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రైతులు తమకు పట్టాలు మంజూరు చేయాలనే వినతులు తీసుకురాగా సరైన పత్రాలు లేవని అధికారులు వినతులు స్వీకరించలేదు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

- డీఎస్ఎఫ్ఐ జాతీయ కన్వీనర్ వివేక్



పాకాల ఏరును పరిశీలిస్తున్న వివేక్, తదితరులు

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించి, రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని డీఎస్ఎఫ్ఐ జాతీక కన్వీనర్ డాక్టర్ వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాకాల ఏటి చెక్‌డ్యాం ను ఆయన పరిశీలించి మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పాలకులు పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. సార్వత్రిక ఎన్నికలను ప్రజలు బహిష్కరిస్తే తప్ప, ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. ఇల్లందు నియోజకవర్గంతోపాటు, మానుకోట జిల్లా వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. శాంతికుమార్, సాయికుమార్, సూర్యప్రకాష్, భీమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

తొర్రూరు: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఏఐయూకేఎస్ జిల్లా నాయకులు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఏఐయూకేఎస్ డివిజన్ ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అనంతరం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఊడుగుల రాములు, ప్రధాన కార్యదర్శిగా జక్కుల యాకయ్యలు ఎన్నికయ్యారు.

పంట రుణాలు అందించాలి

కొత్తగూడ: ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు అటవీ హక్కు పత్రాలపై పంట రుణాలు అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా నాయకుడు ప్రభాకరన్న మాట్లాడుతూ రైతు భరోసా రాక రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. భిక్షం, పాపయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయలు

గార్ల: కదిలే రైలు నుంచి దిగిన ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం గార్ల రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. సీరోలు మండలం ఉప్పరిగూడేనికి చెందిన తుమ్మ సతీష్ మహబూబాబాద్‌లో హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. హౌర ఎక్స్‌ప్రెస్‌కు గార్లలో హాల్ట్ లేదు. గార్ల రైల్వేస్టేషన్‌లో రైలు ఆగకుండా వెళ్తుండగా, కదిలే రైలు నుంచి ప్లాట్‌ఫారంపై దిగగా, అతడికి కాలు విరిగి, శరీరమంతా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన గార్ల సీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ సతీష్ ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గొడ్డలితో సైకో హల్‌చల్



చికిత్స పొందుతున్న వల్లపు రాములు

కురవి/నెహ్రూసెంటర్: గొడ్డలితో సైకో చేసిన దాడిలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన కురవి మండలంలోని సూదనపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ వ్యక్తి గొడలితో బెదిరిస్తూ వీరంగం సృష్టించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న వృద్ధుడు వల్లపు రాములుపై సైకో దాడి చేయగా రాములు చెవిపై భాగంలో బలమైన గాయమైంది. వెంటనే గ్రామస్తులు సైకోకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయాలపాలైన వల్లపు రాములును జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ సంఘటపై సిరోలు ఎస్సై నగేష్‌ను వివరణ కోరగా హల్‌చల్ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, అతడిని విచారించి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గ్రామస్తుల దేహశుద్ధితో గాయపడిన సైకోను సైతం ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

పాఠశాలల్లో పునఃప్రారంభ సందడి

జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బడిలో నూతనంగా అడ్మిషన్ పొందిన వారితోపాటు తరగతి పెరిగిన విద్యార్థులు ఆనందంగా పాఠశాలకు వచ్చారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలికారు. కాగా, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను తొలిరోజు అందంగా.. ఆకర్షణీయంగా ముస్తాము చేశారు. - సాక్షినెట్‌వర్క్



కేసముద్రం: తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



డోర్నకల్‌లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బయ్యారం: ఉప్పలపాడులో..



మరిపెడ: సీతారాంపురం పాఠశాలలో..



చిన్నగూడూరు: యూనిఫామ్స్‌తో విద్యార్థులు



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్‌లో..

పేదోళ్ల కల నెరవేరుతోంది

డోర్నకల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పేదోడి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ తెలిపారు. డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సుమేర్‌చంద్‌జైన్ మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకకు అనుమతి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకకు అనుమతులు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ చందా నరేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదిస్తే ఉచిత ఇసుకకు అనుమతి ఇస్తామని తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత, ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: మండలంలో 4 క్వింటాల 50 కేజీల నల్లబెల్లం 50 కేజీల పట్టిక పట్టుకొని ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆగపేట, నిదానపురం గ్రామాల్లో నల్లబెల్లం సప్లయ్ జరుగుతుందనే సమాచారంతో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆగపేట గ్రామం నుంచి నిదానపురం గ్రామానికి ట్రాక్టర్‌లో నల్లబెల్లం, పట్టిక తరలిస్తున్నారని, ట్రాక్టర్ సీజ్ చేసి నిదానపురం గ్రామానికి చెందిన లింగయ్య, ప్రభాకర్, జలెంధర్, ఉదయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేతనాలు విడుదల

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 202 మంది పని చేస్తున్నారు. వారిలో 143 మంది పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు 5 నెలలు పెండింగ్‌లో ఉండగా విడుదల అయ్యాయని మున్సిపల్ అకౌంటెంట్ లింగాల కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాల విడుదల విషయంలో కమిషనర్ రాజేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని యూనియన్ల నాయకులు ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నగూడూరు: కొత్తగా పట్టాదారు పాసుబుక్‌లు పొందినవారు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాసుబుక్‌లు పొందిన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంతో జతచేసి రైతువేదికలో ఏఈఓలకు అందజేసి రైతు భరోసాకు నమోదు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం..

మంచినీటి శుద్ధీకరణ యంత్రాల పంపిణీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌కు రూ.20 వేల విలువ గల రెండు మంచినీటి శుద్ధి యంత్రాలను గురువారం అందచేశారు. హైస్కూల్‌కు చెందిన 1997-98 టెన్త్ విద్యార్థులు ఈ యంత్రాలను అందచేశారు. ఎంఈఓ రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నిక

గార్ల: సీపీఐ మండల కార్యదర్శిగా జంపాల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొత్తతండాలో జరిగిన పార్టీ మండల మహాసభలో పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శులుగా రాగం రమేష్, సోమనబోయిన కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు.

మున్సిపాలిటీలో గాడితప్పిన పాలన

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీలో పాలన గాడితప్పిందని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి ఆరోపించారు. పార్టీ పట్టణ సమితి సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వీధి లైట్లు వెలగడం లేదని, కార్మికులకు సరిగ్గా వేతనాలు అందడం లేదని, కౌన్సిలర్ల పదవీకాలం ముగిసిన నాటి నుంచి పాలన అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, శ్రావణ్, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలి

బయ్యారం: మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సంతులాల్‌పోడుతండాలో గురువారం రాజు, కాంతి అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. సంతులాల్ పోడు తండాలో గుగులోత్ భద్రు స్థూపాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, కట్టిబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం శివారులో విద్యుత్‌ఘాతంతో పాడిగేదె మృతి చెందింది. బాధితుడు వీరబోయిన మురళీ కథనం ప్రకారం.. రోజు వారీగా మేతకోసం పాడిగేదె అడవికి వెళ్లింది. బుధవారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో పాడిగేదెకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పెద్దకిష్టాపురంలో ఆవు..

గార్ల: పెద్దకిష్టాపురంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతిచెందింది. పెద్దకిష్టాపురానికి చెందిన గంగావత్ మోతీలాల్‌కు ఆవును ఉదయం మేతకు వదిలాడు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఆవు మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కృష్ణమాదిగ పోరాట ఫలితమే వర్గీకరణ

నెహ్రూసెంటర్: మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని, వర్గీకరణతో మాదిగ, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం అన్నారు. వీహెచ్‌పీఎస్ కాలనీలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.పాష అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లో సన్మాన సభ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆత్మీయ భరోసాను ఇవ్వాలి

గంగారం : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలకు రూ. 12,000 ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వినతిపత్రాన్ని అందించారు.

డీపీఎస్ అనుమతులను రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : మానుకోటలో బోగస్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అనుమతులను రద్దు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ డిమాండ్ చేశారు. డీఈఓ రవీందర్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పాఠశాల లోగో.. అసలైన డీపీఎస్ లోగోను పరిశీలించాలని అన్నారు. గిరిజనుల భూములు కబ్జా చేసుకుని నిర్మాణ అనుమతులు, స్కూల్ అనుమతులు లేకుండానే కేవలం ఓపెనింగ్ అనుమతితోనే అడ్మిషన్లు చేసుకుంటున్నారని తెలిపారు. స్కూల్ పేరును అడ్డం పెట్టుకొని గిరిజన లంబాడి ప్రజల భూములను కాజేయడం జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి కుట్రలో ఒక భాగమన్నారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్, టౌన్ అధ్యక్షుడు ధరావత్ హాతిరాం నాయక్, భూబాధితులు పాల్గొన్నారు.

కడుపునొప్పితో బాలిక మృతి

కురవి: కడుపునొప్పితో ఓ మైనర్ బాలిక మృతి చెందిన సంఘటన సీరోలు మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..సీరోలు మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక కడుపునొప్పితో మృతి చెందింది. కాగా మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.